# మధుర భావన-8

సుమజ నవ్వింది. ''ముందుగా మా నాన్న మీకు... మంచి కితాబే ఇచ్చేశారుగా. అమ్మ మన విషయం చెప్పినపుడు... నేను ముందుగా చెప్పలేదని కోపం తెచ్చుకుంటారేమోనని ఊహించానా... కానీ... 'అమ్మాయి ఇష్టపడిందంటే... అతను సామాన్యమైన వ్యక్తి అయివుండడు... ' అంటూ నవ్వారని అమ్మ నాకు చెప్పింది....!''

''అయితే ఇది... కేవలం నన్ను మెచ్చుకోవటంలా లేదు... మీరు ఇష్టపడినందు వల్లే నేను గ్రేట్ అనటం అంటే... మిమ్మల్ని ఎక్కువ చేసినట్లుగా మాత్రమే అనిపిస్తోంది....!''

సుమజ కూడా తగ్గకుండా వెంటనే జవాబు చెప్పింది! ''అవునా... మరి... మా అమ్మకూడా 'మీలాంటి కొడుకు ఉన్నందువలనే మీ అమ్మ అంత గొప్పగా తనకు అనిపించా'రన్నట్లుగా మాట్లాడింది... అంటే... ఏమిటి దానర్థం అయివుంటుందీ...?'' అంటూ అల్లరిగా నవ్వింది కూడా.

వంశీ కూడా నవ్వాడు. ''అది సరేగానీ... మీ స్నేహితురాలికి చెప్పిన చిన్న కవితలాంటిదేదైనా నాకూ చెప్పకూడదా...?'' గోముగా అడిగాడు.

సుమజా అలాగే అంది ''మరి... మీ ధోరణిలో.. అదే పాటల కొటేషన్స్ తో అడగవచ్చుకదా...?''

వంశీ గొంతు సవరించుకున్నాడు ''చెప్పవేల చిరుకవితా... చిరంజీవి సౌభాగ్యవతి సుమజా... నీ మానస చోరుడు... ఏ మూలనో పొంచి, నిను వినుచున్నాడని ఎంచి... చెప్పరాదా... చిరు కవితా...'' సరదాగా రాగం తీసిన వంశీ గొంతు విని సుమజ నవ్వుతో ''అబ్బో...!'' అంది. మళ్ళీ ఒక క్షణం తర్వాత అడిగింది. ''ఏ సందర్భం లేకుండా... ముందుగా ఆలోచించకుండా ఎలా చెప్పగలను...? నా ఫ్రెండు పెళ్ళి వార్షికోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయటానికి కదూ రాసానూ అది...?''

వంశీ జవాబు ఇలా ఉంది ''నాకే తెలియని పుట్టినరోజు గురించి... ఇంకా జరగని పెళ్ళిరోజు గురించీ కవితలను చెప్పమని ఎలా అడగగలను గానీ... మన ప్రేమ గురించి సరదాగా ఓ కవిత చెప్పగూడదూ....?''

''సరే అయితే... ఆశువుగా చెప్పేంత సామర్థ్యం లేదుగానీ... మీ పద్ధతిలోనే ప్రయత్నం చేస్తాను.

'ఒకరికొకరుగా... ఇద్దరం ఒకరుగా అమరిపోదామా... రసరమ్య లోకాలనేలి కొత్తరుచులు కనుగొందామా'....!'' గుసగుసగా అని తర్వాత సరదాగా నవ్వేసింది. ''కొంచెం పాతవాసనేస్తోంది కదూ...?'' అని మళ్ళీ అడిగింది.

వంశీ కూడా నవ్వుతూ అన్నాడు '' అదేం లేదు... నాకు చాలా బావుందనిపించింది! నీ దగ్గర్నుండి మరో కవితో, ఫోన్ కాలో వచ్చేవరకూ దీనిని మనసులో మననం చేసుకుంటూ వుంటాను...!"

''సరే... అలాగే కానివ్వండి, ఇప్పటికి ఇక ఈ కబుర్లకి ముగింపు చెప్పేద్దాం. మా అమ్మ నాతో ఏదో చెప్పాలనుకుంటోందేమో మరి, గది గుమ్మం దగ్గరికి వచ్చి... నేను ఫోనులో మాట్లాడటం చూసి వెనక్కి వెళ్ళిపోయింది...!'' అంటూ సుమజ ఫోను ఆపేసింది.

* * *

తల్లి ఫోనులో ''ఒకసారి వచ్చి వెళ్ళరాదూ...?'' అనటం విని వంశీ ''ఎవరినమ్మా రమ్మని పిలుస్తున్నావూ...?'' అనడిగాడు.

ఆవిడ నిట్టూరుస్తూ ''అనూషనేలే...!'' అంది.

అనూషని అమ్మకి చూడాలనిపించి రమ్మని పిలుస్తోందనుకుని ఇక తల్లిని ఆ విషయంపై ఏమీ అడగకుండా వూరుకున్నాడు వంశీ.

అనూష తొందరగానే వచ్చింది. కుశల ప్రశ్నలూ వగైరాలాంటి కబుర్లన్నీ అయ్యాక స్థిమితంగా కూర్చుని తల్లిని ''ఎందుకమ్మా రమ్మని పిలిచావూ...?'' అనడిగింది.

''అదే...నీకు అన్నయ్య పెళ్ళిలో లాంఛనమో, కానుకో ఏ పేరయితేనేంలే... ఏదో కావాలని అన్నావుగా... అదేమిటో మళ్ళీ వచ్చినపుడు చెబుతానన్నావుగా... అదే ఏమై ఉంటుందోననే ఆలోచన తెగక సరే, నిన్నే అడుగుదామని రమ్మన్నాలే!'' అంది శ్యామసుందరి.

ఆ మాటకి అనూష కొంచెంగా నసుగుతూ ''ఇది నా కోరిక అనుకునేవ్... కాదమ్మా... మా అత్తగారూ, ఆయన వాళ్ళదే. ఇదయితే బావుంటుందీ... అడుగూ అన్నారు...'' అంటూ అనూష చెప్పిన విషయం విని ఆవిడ తెల్లమొహం వేసింది.

''అదీ... అదెలా కుదురుతుందే....?'' అంది బలహీనమైన స్వరంతో.

''మా వాళ్ళ కోరిక విని... నీలాగే నేనూ అనుకున్నా. అందుకే కదా క్రితంసారి వచ్చినపుడు ముందుగా మాట తీసుకున్నా. మా అత్తగారూ వాళ్లతో మా అన్న, అమ్మ సరే నన్నారు అని కూడా చెప్పేసా.'' అంది అనూష.

మళ్ళీ తల్లివైపు చూసి ''దగ్గరున్నది ఏదైనా సరే ఇస్తామని చెప్పి.... ఇపుడు మేము కావాలనుకున్నది చెబితే... నువ్వింతలా ఆశ్చర్యపోతున్నావేం...?'' అంది అనూష తల్లిని నిలదీస్తున్నట్లుగా.

''అదికాదు అనూ... వాళ్ళు అడిగారనుకో... నీకు విషయం అంతా తెలుసుకాబట్టి... వాళ్ళకి వివరం చెప్పకపోయావా...?'' అందావిడ.

అనూష నిర్లక్ష్యంగా చూసి ''చెప్పాను... చెప్పకుండా ఎందుకు ఉంటానూ...?'' అంటూ పెదవి విరిచింది.

''అది కాదు అనూ...'' అంటూ తల్లి ఏదో చెప్పబోతోంటే... అనూషకు అసహనం కలిగి అడ్డం పడుతూ చిరాకుగా జవాబు చెప్పింది.

''నేను... అన్నయ్య దగ్గర్నుండో... లేక ఈ ఇంటికి కోడలుగా రాబోయే, ఆవిడ లేక తనవైపు వాళ్ళ దగ్గర్నుండో అభ్యంతరం వస్తుందనుకున్నాగానీ... మొదటగా నువ్వే కాదంటున్నావ్...! అదే నాకు విచిత్రంగా ఉంది! మా అత్తగారూ వాళ్ళు కూడా ఈ మాటే అన్నారు... నేను నీ కన్నకూతుర్ని కాబట్టి... నీకు అభ్యంతరం ఉండదని నమ్మకంగా అనుకున్నారు! కానీ నువ్వేమిటో...'' అంటూ అనూష నిట్టూర్చి... ఒక క్షణం తర్వాత మళ్ళీ అంది ''చాలా అసహజంగా ప్రవర్తిస్తున్నావు...!''

అనూష మాటలకు ఆవిడ కోపంగా కూతురివైపు చూసింది.

తల్లి చూపుల్లోని తీవ్రతకు అనూష ఏమీ చలించలేదు.... ''ఎందుకమ్మా... నేనేదో కాని మాటలంటున్నట్లుగా నీకు కోపం వస్తోందీ...? నేనన్నదాంట్లో తప్పేం ఉందీ...? పెళ్ళయిన పిల్ల వాళ్లత్తగారూ, ఆయన మాటల్ని కాదనగలదా... అక్కడ సుఖంగా ఉండాలంటే, వాళ్ళు చెప్పినట్లు వినాలి కదా... నువ్వేమో... కొడుక్కి ఒక్కతే కూతురున్న సంబంధం... పైగా ఆస్తిపాస్తులు బాగా ఉన్నవాళ్ళని చూసి పెళ్ళి చేస్తున్నావ్...! నాకు మాత్రం ఇద్దరు కొడుకులు, కూతురూ ఉన్న వాళ్ళని చూసి చేశారు...! బాధ్యతలు, బరువులూ ఎక్కువ... ఆస్తిపాస్తులేమో అంతంతమాత్రం...!''

కూతురి మాటల్లోని నిష్ఠూరానికి ఆవిడ నివ్వెరపోయింది. కోపాన్ని నిగ్రహించుకుని సామరస్యంగానే చెప్పటానికి ప్రయత్నించింది. ''ఏం మాట్లాడుతున్నావే...? మతిపోయిందా...? నేను... సంబంధం చూసానా...? వాళ్ళిద్దరూ ఇష్టపడితేనే గదూ... పెద్దవాళ్ళం సరేనని అన్నాం. అంతేగా జరిగింది. మరి... నువ్వు ఎవరినైనా ప్రేమించానంటూ తీసుకువచ్చి... మాకు చూపిస్తే... అతను ధనికుడా, పేదవాడా అని చూడకుండా చేసేవాళ్ళమేమో! అలా జరగలేదు కాబట్టి... మేమే సంబంధం చూసి వాళ్ళు అడిగినవన్నీ ఇచ్చి మరీ నీ పెళ్ళి జరిపించాం! గుర్తిందిగా! అపుడు ఇష్టపడి...ఇపుడేమో ఇలా మాట్లాడు తున్నావ్...!''

శ్యామసుందరి అలా కటువుగా జవాబు చెప్పేసరికి అనూషకి ఏమనాలో వెంటనే తోచలేదు.

ఒక క్షణం తర్వాత... ''పోమ్మా... నీ మాటలన్నీ ఇలాగే ఉంటాయి...! నీకు నా కంటే... అన్నయ్యే ఎక్కువ ఇష్టమని తెలుస్తోందిలే...!'' అంటూ విసురుగా తన గదిలోకి వెళ్ళి తలుపులు మూసుకుంది.

కాసేపటికే అనూష అత్తగారూ, ఆయనా వచ్చారు. ఆ వూరిలో వాళ్ళ దగ్గర బంధువులింట్లో శుభకార్యానికి అందరూ కలిసి వచ్చామనీ, తను రమ్మని పిలిచినందుకు ముందుగా అనూష తమ ఇంటికి వచ్చిందని శ్యామ సుందరికి చెప్పి, బంధువులకి ముందుగా వెళ్ళి ఓ సారి కనిపించి... తర్వాత ఇపుడు అనూషని వెంటబెట్టుకుని వెళ్ళాలనుకుంటున్నామనే విషయం వివరంగా చెప్పారు.

శ్యామసుందరి చిరునవ్వుతో వాళ్ళకి చెప్పింది. ''ఒక విషయం అడగాలని రమ్మని అన్నాను. అయితే, మీరంతా కూడా వచ్చినట్లుగా అనూష చెప్పలేదు. మీరు మా అబ్బాయి పెళ్ళికి అనూకి ఆడబడుచు లాంఛనంగా అడగాలనుకున్నదాని గురించి ఇప్పుడే చెప్పింది. నేనలా ఎలా వీలవుతుందీ అన్నానని నా మీద అరిచి, అలిగి గదిలోకి వెళ్ళిపోయింది...!''

వాళ్ళు విస్తుపోతూ తాము ఏమి అడగలేదన్నారు. క్రిందటిసారి వచ్చినపుడు మీరు తను అడిగినది ఇస్తామన్నారని చెబితే, అలా బావుండదేమోనని అన్నట్లుగా అనూ అత్తగారూ, అల్లుడూ కూడా అనేసరికి శ్యామసుందరి విస్తుపోయింది!

అంటే, అదికేవలం తన కూతురి కోరిక మాత్రమేననే విషయం ఆవిడకు అర్ధమైంది! తనే అడగలేక అత్తగారు, భర్త వాళ్ళు అడిగారంటూ చెప్పింది కాబోలనిపించి దిగాలు పడింది.

ఒక నిమిషం లోనే సర్దుకుని, అనూషని పిలిచింది. వాళ్ళత్తగారూ వాళ్ళూ వచ్చారనే విషయం చెప్పి.

గది తలుపు తట్టి, తల్లి... ఆ విషయం చెప్పగానే ఢడాలున తలుపు తీసి అనూష వాళ్ళతో విసురుగా చెప్పింది. ''నేనక్కడికి రాను! నాకు మనసు బాగాలేదు! మీరటునుండే మన వూరుకు వెళ్ళిపోండి. నేనెపుడు వస్తానో తర్వాత చెబుతా...!' మళ్ళీ తలుపులు గట్టిగా వేసేసుకుంది.

అత్తగారూ వాళ్ళకి అంత నిరసనగా జవాబు చెప్పటం శ్యామసుందరికి నచ్చలేదు. కానీ... ఏం చేయాలో తోచక నిట్టూరుస్తూ వుండిపోయింది. వాళ్ళూ చేసేదేం లేక వెళ్ళొస్తామని చెప్పి బయలుదేరారు.

వాళ్ళు వెళ్తూండగానే... బయటకు వెళ్ళిన వంశీ ఇంట్లోకి వస్తూ... వాళ్ళని పలుకరించి, విషయం తెలుసుకుని... లోపలకు వచ్చాడు.

''అనూష వచ్చిందా...?'' అంటూ వంశీ అడిగిన ప్రశ్నకి అవునన్నట్లుగా ఆవిడ తలవూపి గదివైపు చూపించింది.

వంశీ పిలుపుకి తలుపు తీసుకుని బయటకు వచ్చిన అనూషతో 'తన అత్తగారూ వాళ్ళతో బంధువులింట శుభకార్యానికి వెళ్ళటం బావుండేదిగా' అనడిగితే ''నాకు మనసు బావుండక వెళ్ళాలనిపించలేదు...'' అని అనూష నిర్లిప్తంగా బదులు చెప్పింది.

ఎర్రబడ్డ కళ్ళతో ఉన్న అనూష వైఖరిని అపుడు గమనించిన వంశీ ఏమైందన్నట్లు తల్లి వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

ఆవిడ కూతురివైపు చూసి ''కూర్చో... మీ ఇద్దరితో మాట్లాడాలి...!" అంది. వాళ్ళిద్దరూ తన ఎదురుగా కూర్చోగానే శ్యామ సుందరి వంశీ వైపు నిశితంగా చూసి ''వంశీ... నీకిదేమైనా బావుందా... ఒకే ఇంట్లోని పిల్లలుగదా నువ్వూ.. అనూషా! అలాంటపుడు అనూషకి సాదాసీదా మామూలు మధ్యతరగతి వాళ్ళ సంబంధం చేసి, నువ్వేమో సంపన్నుల అమ్మాయిని... చేసుకుంటావా? ఒక్కత్తే అమ్మాయి అని, బాగా డబ్బున్నవాళ్ళనీ తెలుసుకుని ఎన్నుకోవటం... న్యాయంగా ఉందా...?''

తల్లి నిలదీసి అడుగుతున్నట్లుగా ఉన్న ఆ ప్రశ్నకి వంశీ తెల్లమొహం వేసాడు.

''ఏమిటమ్మా నువ్వంటున్నదీ? ఆ అమ్మాయి ఒక్కతేననే విషయం... అనుకున్న తర్వాతనే కదూ తెలిసిందీ...? పైగా వాళ్ళకి ఏం ఆస్తిపాస్తులున్నాయో ఇప్పటికీ మనకేం తెలియనే తెలియదుగా...'' అన్నాడు.

''బిజినెస్ ల ద్వారా ఆ అమ్మాయి నాన్న బాగా సంపాదించాడని, వాళ్ళ విశేషాలన్నీ ముకుందం మామయ్య దామోదరం గారి ద్వారా తెలుసుకుని అనూషా వాళ్ళకి చెప్పాడట!'' శ్యామసుందరి చెప్పింది.

''అయితే... ఆ విషయాలతో నాకేం సంబంధం ఉందమ్మా...? అయినా ఆస్తిపాస్తుల వివరాలన్నీ తెలుసుకున్నాక ప్రేమిస్తారా...? విడ్డూరంగా మాట్లాడుతున్నవేంటీ? అనూషకి మీరు సంబంధం వెతికి చాలా మంచి అబ్బాయని తెలుసుకునే కదా అతనితో పెళ్ళి చేసారూ...! ఇపుడు అనూషకి అతనితో గానీ, వాళ్ళ అత్తగారితోగానీ సమస్యలేం లేవుగా... సంతోసంగానే ఉందిగా...!'' సందేహంగా తల్లివైపు, అనూషవైపు ఆశ్చర్యంగా చూశాడు వంశీ.

తల్లి వంశీ వైపు కొంచెం తీవ్రంగా చూసి ''సంతోషం అంటే... అతను బుద్ధిమంతుడూ, మంచివాడూ అయితే సరిపోతుందా...? ఆస్తిపాస్తుల లెక్క ఉండదా...?'' అంది.

వంశీ కేమీ అర్థంకాక అయోమయంగా చూశాడు. అతనికేమీ అర్థం కావటం లేదు...''అమ్మా... నాన్న ఉన్నపుడేగా... అన్ని విషయాలూ ఆలోచించి అనూషకి పెళ్ళి చేసాముా...?'' మెల్లగా నసిగాడు.

తల్లి మాటల ధోరణి ఎటువైపు దారి తీస్తుందోనని ఆలోచిస్తు ఉండిపోయింది అనూష.

తల్లి మాటల వెనుక ఏదో మర్మం ఉన్నట్లుగా అతనికి అనిపించింది!

శ్యామసుందరి నిట్టూర్చింది. ''అవును! అనూషకి పెళ్ళి నిశ్చయమయ్యాక, మీ నాన్న మన ముగ్గురినీ కూర్చోబెట్టి చెప్పిన విషయం గుర్తుందా నీకు...?'' ఆవిడ వంశీ వైపు సూటిగా చూస్తూ అడిగింది.

వంశీ వదనంలోకి ఆ ప్రశ్నతో చిరునవ్వు వచ్చింది!

''బావుంది! గుర్తుందా అనడుగుతున్నావా...? అమ్మా... ఆనాడు నాన్నగారు చెప్పిన ఆ మాట నా మనసులో ఎపుడూ మననం అవుతూనే ఉంటుంది! నాన్న చెప్పినట్లుగా మంచి ఆలోచనలతో మనసు నిండివుంటే... జీవితం ఆనందంగా గడిచిపోతుంది! నాన్న చెప్పిన ఆ 'మధుర భావనే' సుమజతో నా పరిచయానికీ, ప్రేమకీ కూడా కారణం అయింది! అయినా అన్ని విషయాలూ నీకూ తెలుసు కదా... ఇపుడేమిటీ ఇలా కొత్తగా అడుగుతున్నావూ...?''

వంశీ మాటలకు ఆవిడ తలవూపుతూ ''నిజమే... మధుర భావన అంటూ చెబుతూ మన కుటుంబం గురించీ చెప్పారు. ఒకసారి జ్ఞాపకం తెచ్చుకో...!'' అంది శ్యామసుందరి.

****

సీతారామ్ భార్య, వనజ పెళ్ళయిన కొంతకాలినికే ఒక అబ్బాయిని కని ప్రసవించిన పదిరోజులకే చనిపోయింది. పిల్లాడిని ఒంటరిగా పెంచటంలోని సాధక బాధలు అన్నీ అనుభవించిన సీతారామ్ అందరి మాటలకూ, మరో పెళ్ళికీ, తలవంచక తప్పలేదు.

మారుటి తల్లి వలన తన స్వంత పిల్లాడుతో తన జీవితం ఎలా ఉంటుందోనని ఆయన భయపడ్డాడు. కానీ అటువంటిదేం లేకుండా రెండో భార్యగా వచ్చిన శ్యామసుందరి వంశీని తల్లిలా ఆదరించటం అతనికి ఆనందం కలిగించింది!

పిల్లవాడిని కన్నతల్లి తనే అన్నట్లుగా శ్యామసుందరి పెంచింది! వంశీకీ ఆవిడంటే అంతే ప్రేమాభిమానాలు ఏర్పడ్డాయి! శ్యామసుందరి తనను కన్న తల్లికాదని, పెంచిన తల్లి మాత్రమే ననే విషయం చాలానాళ్ళ వరకూ వంశీకి తెలియదు! ఎవరో బంధువులావిడ చెప్పితే తెలిసింది గానీ ఆ విషయానికి తల్లి, కొడుకు ఇద్దరూ ప్రాముఖ్యత ఇవ్వలేదు.

కొంత కాలానికి అనూష పుట్టింది. శ్యామసుందరిలో ఏ మార్పు రాలేదు. ఇద్దరూ తన పిల్లలనే భావించింది. వాళ్ళకూ ఆ భేదం తెలియనట్లుగా ఆవిడ ప్రవర్తన ఉండేది!

అనూషకు పెళ్ళి నిశ్చయమయ్యాక, పెళ్ళికి ముందు సీతారామ్ పిల్లలు ఇద్దర్నీ భార్యనీ కూర్చోబెట్టుకుని ఒక విషయం చెప్పాడు.

''అనూషకు నిశ్చయమైన సంబంధం వాళ్ళు అడిగినవన్నీ కాదనకుండా నా ఆస్తిపాస్తులలో మూడొంతుల భాగం అనూష పేరున రాసేశాను! అయితే, వంశీకి మాత్రం అతని కన్నతల్లి తరపున వచ్చిన డబ్బుకి కొంత కలిపి నేను కొన్న ఒక స్థలాన్ని అతని పేర రాసి, అందులో ఒక ఇల్లు నా స్థోమతను బట్టి కట్టి ఇవ్వగలగాలనే ఉద్దేశ్యం ఉంది!'' అని చెప్పినపుడు వంశీ వెంటనే అన్నాడు ''నాన్నా... అమ్మ అంటే... ఎవరో అని నేననుకోను... అమ్మ అనే మాటకి అర్థంగా ఈ అమ్మ మాత్రమే నాకు తెలుసు'' అని శ్యామసుందరి చేయి పట్టుకున్నాడు.

ఆ చేతిని చెంపకు ఆనించుకుని శ్యామసుందరి ''అవును... వీడు నా కొడుకు!'' అంది.

''అయితే.... ఆ స్థలం నీ ద్వారానే వాడికి చెందుతుంది! వాడిపట్ల నీకున్న ప్రేమాభిమానాలలో ఎటువంటి సందేహం లేదు కాబట్టి నీ పేరనే పెడతాను!'' అన్నారాయన.

‘‘అవున్నాన్నా... అలా చేయండి. ఏదైనా ఒకటే కదా...!’’ అన్నారు పిల్లలిద్దరూ కూడా.